క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శి మృతి


జి.వి.రమణ(ఫైల్)

దత్తిరాజేరు: మండల కేంద్రం దత్తిరాజేరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జి.వి.రమణ(60) అనారోగ్యం తో బుధవారం మృతిచెందారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జి.వి.రమణకు కొద్దిరోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు వారం క్రితం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందారని ఎంపీడీఓ చెప్పారు. మృతదేహాన్ని స్వస్థలం కొత్తవలసకు తరలించడంతో ఎంపీడీఓ, మండల కార్యదర్శులు అక్కడికి వెళ్లి నివాళి అర్పించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

'అభయ' కార్డుల అందజేత


ప్రజలకు అభయ కార్డులు అందజేస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

శృంగవరపుకోట: స్థానిక సచివాలయం–4 పరిధిలో కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారులు జె.హారిక, బి.శిరీష ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించి న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ భాస్కరరావు పర్యవేక్షించారు. వైద్యసేవలపై ప్రజలను ఆరా తీశారు. అనంతరం ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా 'అభయ' కార్డులను పంపిణీ చేశారు. అలాగే ఎస్.కోట పరిధిలో చేపడుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే సమగ్రంగా చేయాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ


చెత్తసేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నరసింహమూర్తి

గుర్ల: మండలంలోని జమ్ము గ్రామంలో సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతని అన్నారు. చెత్తను కాలువల్లో, ఆరుబయట పారబోయకుండా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము రామ్మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న త్రిసభ్య కమిటీ చైర్మన్ రమణ

బొండపల్లి: గొట్లాం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయ కులు మీసాల తులసీరాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ మాధవి

మెంటాడ(గజపతినగరం రూరల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నా యని పిడిశీల గ్రామ సర్పంచ్ పాండ్రంకి మాధవి అన్నారు. పిడిశీల గ్రామంలో పత్తిగుల్ల పుష్పవతికి మంజూరైన వితంతు పింఛన్‌ను బుధవారం ఆమె అందజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయశాఖ
శ్రీ నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానం
చీపురుపల్లి గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా

శ్రీ నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థానమునకు చెందిన 10 బిట్లులో వివిధ విస్తీర్ణములు గల ఇళ్లు మరియు షాపులను అప్పగించిన తేదీ నుండి 3 (మూడు) సంవత్సరముల కాలపరిమితికి నెలవారీ అద్దె చెల్లించు ప్రాతిపదికన టెండర్ కం బహిరంగ వేలమును విజయనగరం దేవదాయ శాఖ అధికారుల సమక్షమున తే27.09.2023ది నాడు ఉదయం గం"10.00లకు సదరు దేవాలయం కార్యాలయం వద్ద నిర్వహించబడును. ఆసక్తి గల షరతులకు లోబడి టెండర్ కం బహిరంగ వేలము నందు పాల్గొనగలరు. షరతులను కార్యాలయం పనివేళలలో అడిగి తెలుసుకొనగలరు.

ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ & ఛైర్మన్ మరియు ధర్మకర్త మండలి సభ్యులు
కార్యనిర్వాహణాధికారి

సమస్యలకు సకాలంలో పరిష్కారం

- ఎస్.కోటలో 'జగనన్నకు చెబుదాం'
- వినతులు స్వీకరించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్
- హాజరైన జిల్లా అధికారులు


ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ అశోక్


మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ అశోక్


కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్.కోట ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి తదితరులు

శృంగవరపుకోట: ప్రజలు అందించే వినతులకు సకాలంలో పరిష్కారం చూపించాలని, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంచాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండలస్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్ర మానికి కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్‌అశోక్ వినతులు స్వీకరించారు. రెవెన్యూ పరమైన సమస్యలపై 24 వినతులు, గృహనిర్మాణ శాఖకు సంబంధించి 13, సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి 5, వైద్యారోగ్యశాఖకు సంబంధించి 4, పంచా యతీ రాజ్‌శాఖకు సంబంధించి 3, డీఆర్‌డీఏ–2, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 3 విన తులు అందాయి. ఆయా వినతులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడి వాటిని సత్వరం పరిష్కరించాలని వారికి అప్పగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై ప్రతి బుధ, శుక్రవా రాల్లో మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తామ న్నారు. మే 9వ తేదీ నుంచి ఎస్.కోట మండలానికి సంబంధించి 315 వినతులు అందగా, వీటిలో 109 వినతులకు సంబంధించిన అర్జీదారులను ఫోన్ లో సంప్రదించి సేవలపై ఆరా తీయ గా 63 మంది అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వినతుల్లో 3వ భాగం రెవెన్యూ సమస్యలే ఉన్నాయని, భూఆక్రమణలు, ఆర్ఓఆర్ తగాదాలు, పాస్‌బుక్‌లు వంటి సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్, గృహనిర్మాణం, విద్యుత్, పోలీస్ శాఖలు తర్వాత స్థానాల్లో ఉన్నాయన్నారు. ఎక్కడైనా ఒక సమస్య ఉత్పన్నమైతే అలాంటి సమస్యలు వేరే చోట రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రజల్లో సంతృప్త స్థాయిని పెంచవచ్చన్నారు. ఆర్డీఓ సూర్యకళ, జెడ్పీసీఈఓ రాజ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి సుదర్శన్‌దొర, అన్ని శాఖల జిల్లా అధికా రులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. వార్డుల్లో మహిళలు, పిల్లలు, ఆరోగ్యశ్రీ వార్డుల్లోని రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు ఎలా అందుతున్నాయి, వైద్యులు స్పందిస్తున్నారా లేదా, ఆస్పత్రిలో సౌకర్యాలు బాగున్నాయా, భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశా లపై ఆరా తీశారు. సేవలు,సదుపాయాలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పసిబిడ్డలకు టీకాలు సకాలంలో వేయించాలని, ముఖ్యంగా ప్రసూతి కేసుల్లో మాతా, శిశువులకు సంబంధించిన వైద్య సేవలు మరింత విస్తృతం చేయాలని, తద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచాలని కోరారు. రోజుకు 80 నుంచి 90 వరకూ ఇన్‌పేషెంట్లు వస్తున్నారని, ఓపీ పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

మహిళా మార్ట్ సందర్శన

ఎస్.కోట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేయూత మహిళా మార్ట్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ సందర్శించారు. మార్ట్ నిర్వహణపై ఏపీడీ సావిత్రి, మండల సమాఖ్య ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఆర్నెళ్ల క్రితం గరివిడి, ఎస్.కోటలో మహిళామార్టులు ప్రారంభించామని, మార్టుపై రూ.40లక్షలు పెట్టుబడి పెట్టి, ఆర్నెళ్లలో రూ.1.30 కోట్లు విక్రయాలు జరిపామని, ఖర్చులు పోను నెలకు రూ.3లక్షల లాభం వస్తోందని చెప్పారు. దీంతో కలెక్టర్ సమాఖ్య ప్రతినిధులను అభినందించారు. మమరిన్ని మార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సూర్యకళ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి


సోషల్ మీడియా సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకులు విజయ్‌కుమార్

- ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్

కొత్తవలస: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష పార్టీలు, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టే బాధ్యత వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా సభ్యులు తీసుకోవాలని, ఆపార్టీ ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ సూచించారు. అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యేతో కలిసి నియోజకవర్గ సోషల్‌మీడియా ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ ప్రాంతాలు, పార్టీలు,వర్గాలు, వర్ణాలు అనే తేడా లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అభివృద్ధి చేస్తున్నారని, వీటిని విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ మరికొద్ది నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని పార్టీ ప్రతిపా దించిన సోషల్ మీడియా ప్రతినిధులు ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ విధానాలను ప్రచారం చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయు డుని కక్షపూరితంగా అరెస్టు చేయలేదని, ఆయన తప్పు చేసినట్లు సీఐడీ వద్ద బలమైన సాక్ష్యాలు ఉన్నందునే అరెస్టు చేశారని స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో సానుభూతి పొందేందుకు టీడీపీ చేస్తున్న ప్రయత్నాన్ని ఎక్కడికక్కడ ఖండించాలని చెప్పారు. నియోజకవర్గంలోని అయిదు మండలా ల సోషల్ మీడియా కన్వీనర్లు, కో–కన్వీనర్లు, మెంబర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకం


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గద్దే బాబూరావు, విద్యార్థులు

చీపురుపల్లి: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టడం చారిత్మాత్మక నిర్ణయమని బీజేపీ విజయనగరం పార్లమెంట్ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు బిల్లు ఆమోదం పొందడంపై పట్టణంలోని విద్యార్థులతో కలిసి ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్‌సభ, రాజ్యసభ, అన్ని రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తించే విధంగా బిల్లు రూపొందించడం మహిళలకు ఎంతో గర్వకారణమని చెప్పారు. మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెపురి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు


వృద్ధురాలికి ఆరోగ్యసురక్ష శిబిరం టోకెన్ అందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్


వేపాడ: సోంపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్ తదితరులు

జామి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి మండలంలో నిర్వహించనున్న మెడికల్ క్యాంపులను విజయవంతం చేయాలని జామి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్ కోరారు. విజినిగిరి గ్రామంలో వైద్యసిబ్బంది, వలంటీర్లు బుధవారం నిర్వహిం చిన జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింట సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతు న్న ప్రజల వివరాలను పక్కాగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సమస్యలున్న వారిని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే వైద్యశిబిరాలకు తరలించి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. 30వ తేదీన విజినిగిరిలో వైద్యశిబిరం నిర్వహిస్తామని చెప్పారు. రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు, హిమోగ్లోబిన్,డెంగ్యూ, మలేరియా, యూరిన్ తదితర టెస్టులు చేస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి వైద్యశిబిరం నిర్వహించే తేదీ, ప్రదేశం వివరాలతో కూడిన టోకెన్‌లు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ భవాని, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆరోగ్య సహాయకులు ప్రసాద్, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

సోంపురంలో సర్వే పరిశీలన

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షసర్వేను ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కూర్మనాథ్ పట్నాయక్ పరిశీలించారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఉన్న వారిని గుర్తించి గ్రామంలో త్వరలో నిర్వహించనున్న వైద్యశిబిరంలో వైద్యం అందించేందుకు టోకెన్‌లు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయన పాటూరులో జగనన్న కాలనీలో తాగునీటి సదుపాయం పనులను పరిశీలించారు. అలాగే బొద్దాంలో సచివాలయాన్ని సందర్శించి రికార్డులు, ఈ–సర్వీసులపై ఆరా తీశారు. సోంపురం సర్పంచ్ గంగరాజు, ఎంపీటీసీ టి.వి.రమణ, స్థానిక పెద్దలు ఆయా గ్రామసచివాలయ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తపాలాశాఖ పథకాలను వినియోగించుకోండి


ర్యాలీ నిర్వహిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు


గజపతినగరం: మాట్లాడుతున్న జెడ్పీటీసీ తవుడు

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తపాలాశాఖ అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. ప్రజలు, ఖాతాదారులతో మమేకమయ్యేందుకు తపాలాశాఖ తీసుకొచ్చిన 'జనంలోకి మనం' అనే కార్యక్ర మాన్ని చీపురుపల్లిలో బుధవారం వారు ప్రారంభించారు. తపాలాశాఖ అమలు చేస్తున్న సాధారణ బీమా పథకాలు, పొదుపు పథకాలపై ఆ శాఖ ఉద్యోగులు స్థానిక తపాలాశాఖ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్, ఆర్టీసీ కాంప్లెక్సు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగులు మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు తపాలాశాఖ సేవల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. పోస్టాఫీస్‌లో ప్రీమియం ఖాతా తెరుచుకోవడం ద్వారా ఏ జాతీయ బ్యాంకు లావాదేవీలైనా సరే ఇక్కడే నిర్వహించుకోవచ్చని, అన్ లిమిటెడ్ క్యాష్ డిపాజిట్లు, విత్‌డ్రాలు చేసుకోవచ్చని, నిర్వహణ చార్జీలు ఉండవని స్పష్టం చేశారు. రూ.396 ప్రీమియంతో రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా పాలసీలు కూడా ఉన్నాయని, వాటి ద్వారా కుటుంబా నికి సామాజిక రక్షణ ఉంటుందన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పతివాడ రాజారావు, తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ జి.అచ్యుతరావు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, వెలుగు ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పోస్టల్ సేవలు

గజపతినగరం: బ్యాంకింగ్ సేవలు మాదిరిగానే తపాలా శాఖ కూడా అన్ని సేవలను ప్రజలవద్దకే అందిస్తోందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 'జనంలోకి మనం' కార్యక్రమం పేరిట మండల కేంద్రంలోని ఆల్తి కూర్మగణపతి కల్యాణ మండపంలో ప్రజలకు పోస్టల్ సేవలపై బుధవారం అవ గాహన కల్పించారు. అతిథులుగా హాజరైన ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ పోస్టల్ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు ప్రతి ఒక్కరూ పోస్టల్ కార్యాలయంలో జీరో అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు సంబంధించిన పథకాల లబ్ధిని పోస్టల్ ఖాతాల ద్వారా కూడా పొందవచ్చని చెప్పారు. స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ,వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, ఎంపీటీసి కర్రి కళావతి,పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యన్నారాయణ,ఐపిపిబి మేనేజర్ సతీష్‌కుమార్ కుమార్,సిబ్బంది రమణ,ఈశ్వరరావు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికోసం అదనపు తరగతులు నిర్వహించాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. బొద్దాం ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు.విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌లను ఏమేరకు వినియోగిస్తున్నారని ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్స్, డైరీలు, విద్యార్థుల వర్క్, నోట్‌బుక్స్ పరిశీలించారు.


విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఎఫ్ఓ రవిప్రసాద్

గజపతినగరం: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని గజపతినగరం అగ్ని మాపక శాఖ అధికారి ఎం.ఎస్.వి. రవిప్రసాద్ అన్నారు. స్థానిక కళామందిర్ థియేటర్ వద్ద సిబ్బందికి, ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీక్‌లు వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని, ఆ సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించి మంటలను అదుపు చేయాలని చెప్పారు. వంట చేసేటప్పుడు గ్యాస్ సిలిండర్ లీకేజ్‌లు వల్ల మంటలు వస్తే భయాందోళన చెందకుండా దలసరి గుడ్డ లేదా నార గోనె, దుప్పటి వంటి వాటిని నీటిలో తడిపి సిలిండర్ చుట్టూ కప్పి ఉంచితే మంటలు ఆగిపోతాయని అన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపిస్తే అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.

చురుగ్గా గృహ సారథుల బీమా నమోదు


దత్తిరాజేరు: మరడాంలో సచివాలయ కన్వీనర్లతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కృష్ణమూర్తి, చిరంజీవి


మెరకముడిదాం: సచివాలయ కన్వీనర్లకు సూచనలు చేస్తున్న జేసీఎస్ కన్వీనర్ ప్రసాద్

దత్తిరాజేరు: మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు పార్టీ తరపున బీమా నమోదు కార్యక్రమం చురుగ్గా చేపడుతున్నామని ఆపార్టీ మండల నాయకుడు రాపాక కృష్ణమూర్తి, టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబర్ దత్తి చిరంజీవి తెలిపారు. షికారు గంజి,రామచంద్రాపురం,పాచలవలస,మరడాం గ్రామాల్లో బుధవారం సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల వివరాలను బీమా కోసం నమోదు చేశారు.

త్వరగా పూర్తి చేయండి

మెరకముడిదాం: గృహసారథులకు వైఎస్సార్‌సీపీ కల్పిస్తున్న బీమా సదుపాయానికి సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో త్వరగా నమోదు చేయాలని సచివాలయ కన్వీనర్లకు మండల జేసీఎస్ కన్వీనర్ కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో మండలంలోని సచివాలయ కన్వీనర్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. బీమా కోసం గృహసారథులు, వారి నామినీల వివరాలను ఏవిధంగా ఆన్‌లైన్ చేయాలో వివరించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాల్‌రావు, కోట్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ల సందర్శన


జామి విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న పర్యవేక్షక ఇంజినీర్ లక్ష్మణరావు

జామి: స్థానిక, కుమరాం విద్యుత్ సబ్ స్టేషన్‌లను విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు బుధవారం సందర్శించారు. ట్రాన్స్ ఫార్మర్లు, రికార్డులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై విద్యుత్‌శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యుత్ సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు.అలాగే జామి సచివాలయం–3ను సందర్శించారు. సిబ్బందికి,వలంటీర్లకు విద్యుత్‌శాఖ సేవలు, తదితర అంశాలపై సూచనలు చేశారు. అనంతరం ఎ.ఆర్.పేట.ఎం.కె.వలస గ్రామాల్లో పర్యటించి ఆర్టీసీఎస్ఎస్ మోడర్నైజేషన్ స్కీమ్ పనులు పరిశీలించారు. ఆయన వెంట రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు, కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్ పి.త్రినాథరావు, ఎస్.కోట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వెంకటరావు,జామి మండల ఏఈ సీహెచ్.దేముడు తదితరులు ఉన్నారు.

దత్తిరాజేరు సర్వేయర్‌గా తిరుపతిరావు

దత్తిరాజేరు: మండల సర్వేయర్‌గా విజయనగరం నుంచి బదిలీపై వచ్చిన తిరుపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారని తహసీల్దార్ సుదర్శనరావు తెలిపారు. అలాగే జూనియర్ అసిస్టెంట్‌గా సాయిపవన్ విధుల్లో చేరారని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు.

చుక్కవలసలో నేత్రవైద్యశిబిరం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస గ్రామంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోచ గరివిడి లయన్స్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 48మందికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేసి 24 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. గ్రామ పెద్దలు అన్నంనాయుడు, మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో నిరంతర ఆదాయం


బహుళ పంటల వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలను సాగు చేయడం ద్వారా రైతులకు నిరంతరం ఆదా యం లభిస్తుందని రీజినల్ ప్రకృతి వ్యవసాయ అధికారి హేమసుందర్ పేర్కొన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో ఏటీఎం మోడల్ విధానంలో సాగుచేస్తున్న బహుళ పంటలను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సెంట్ల విస్తీర్ణంలో నాలుగు అడుగుల బెడ్స్‌ను తయారు చేసుకుని కాయగూరలతో పాటు,ఆకుకూరలు సాగుచేయడం వల్ల రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని చెప్పారు. పంటలకు రసాయన ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులనే వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్త మోపాడ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయశాఖ
శ్రీ నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానం
చీపురుపల్లి గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా

శ్రీ నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థానమునకు చెందిన 6 బిట్లులను వివిధ విస్తీర్ణములు గల ఖాళీ స్థలములను అప్పగించిన తేదీ నుండి 3 (మూడు) సంవత్సరముల కాలపరిమితికి నెలవారీ అద్దె చెల్లించు ప్రాతిపదికన టెండర్ కం బహిరంగ వేలమును విజయనగరం దేవదాయ శాఖ అధికారుల సమక్షమున తే28.09.2023ది నాడు ఉదయం గం"10.00లకు సదరు దేవాలయం కార్యాలయం వద్ద నిర్వహించబడును. ఆసక్తి గల షరతులకు లోబడి టెండర్ కం బహిరంగ వేలము నందు పాల్గొనగలరు. షరతులను కార్యాలయం పనివేళలలో అడిగి తెలుసుకొనగలరు.

ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ & ఛైర్మన్ మరియు ధర్మకర్త మండలి సభ్యులు
కార్యనిర్వాహణాధికారి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com